క్లుప్తంగా

సన్మానం



విష్ణుప్రియను సన్మానిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్‌కు చెందిన విద్యార్థి విష్ణుప్రియ అంతర్జాతీయ కరాటే పోటీల్లో కాంస్య పథకాన్ని సాధించి ప్రతిభను కనబర్చింది. ఈ మేరకు సోమవారం మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి విష్ణుప్రియను అభినందిస్తూ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ గజ్జెల సాయిలు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వల్లాల సత్యనారాయణ, దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి, విష్ణుప్రియ తండ్రి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో పోచమ్మ ఆలయ పునర్నిర్మాణానికి సర్పంచ్ నోముల పద్మకొండల్‌రెడ్డి గ్రామస్తుల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బొబ్బల ఆదిరెడ్డి, వార్డు సభ్యులు ఖమ్మం సతీశ్, బీనవేని రామస్వామి, మహేందర్, కవిత, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రాజిరెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, నోముల వికాస్‌రెడ్డి, ముద్దమల్ల శ్రీనివాస్‌రెడ్డి, రాచూరి అనిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి చేయూత

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని నందారం గ్రామానికి చెందిన కర్ర చంద్రారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో అతని మిత్రబృందం రూ.50వేల ఆర్థిక సాయం చేశారు. అదేవిధంగా గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ డబ్బులను చంద్రారెడ్డి కూతురు పేరుపై పోస్ట్ ఆఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి కుటుంబసభ్యులకు డిపాజిట్ చేసిన జిరాక్స్ కాపీపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు కర్ర బుచ్చిరెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి, మల్కారెడ్డి, కృష్ణారెడ్డి, కిషన్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంపత్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ లేక ఇక్కట్లు

హుస్నాబాద్: విద్యుత్ విజయోత్సవాల వేడుకలు జరుపుతున్న వేళ ప్రభుత్వ కార్యాలయానికి కరెంట్ కట్ చేయడం చర్చనీయాంశమైంది. హుస్నాబాద్ పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయంలో కరెంట్ లేక సోమవారం వాహనాల రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వినియోగదారులు ఇబ్బందులకు గురయ్యారు. పట్టణంలోని ఎంవీఐ కార్యాలయం వారంలో రెండు రోజులు సోమ, గురువారం మాత్రమే పని చేస్తుంది. రూ.10వేల బకాయి ఉండడంతో విద్యుత్ అధికారులు మే 31న సరఫరా నిలిపివేశారు. విషయంపై కార్యాలయ అధికారులను వివరణ కోరగా.. కరెంట్ బిల్లు చెల్లించినట్లు మేసేజ్ వచ్చిందని, విద్యుత్ అధికారులు మాత్రం బిల్లు చెల్లింపు జరగలేదని చెబుతున్నారన్నారు. కనెక్షన్ ఇవ్వాలని ఏఈని కోరిన ససేమేరా అన్నారని తెలిపారు. అధికారుల చొరవతో సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఉపాధి హామీని ఎత్తివేసేందుకు కుట్ర

దుబ్బాక: ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తూ శ్రమ దోపిడీకి పాల్పడుతోందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ ఆరోపించారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట గ్రామంలో కూలీలు పనిచేస్తున్న ప్రదేశాలను పర్యటించి ఉపాధి హామీ కూలీల బాధలు అడిగి తెలుసుకున్నారు. రోజూ కూలీ కనీసం వంద రూపాయలు కూడా పడడం లేదని కూలీలు తమ సమస్యలను వెల్లబుచ్చుకున్నారు. వెంటనే కూలీలకు కనీస వేతనంతో పాటు, అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

మిరుదొడ్డి(దుబ్బాక): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని లింగుపల్లిలో సోమవారం పర్యావరణ పరిరక్షణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీసీసీ జిల్లా కన్వీనర్ సూకూరి ప్రవీణ్, నేలమ్మ రైతు సహకార సేవా సంఘం ప్రతినిధులు సుజాత, శ్రీమతి పాల్గొన్నారు.

రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం



షోరూం ప్రారంభోత్సవంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి, తదితరులు

గజ్వేల్: పట్టణంలో రామ్‌రాజ్ కాటన్ సంస్థ తన నూతన బ్రాంచీని సోమవారం ప్రారంభించింది. ఎన్టీఆర్ కూడలిలో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌ను ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్‌లు హాజరయ్యారు.

విద్యుత్ ఉత్పత్తిలో ఆదర్శం

హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్



హుస్నాబాద్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: విద్యుత్ ఉత్పత్తిలో రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుందని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. సోమవారం హుస్నాబాద్ పట్టణ శివారులోని పోతారం(ఎస్) శుభం గార్డెన్‌లో నియోజకవర్గ స్థాయి దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ విజయోత్సవ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి విద్యుత్ డివిజన్ డీఈ శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ వచ్చిన తర్వాత 24 గంటల కరెంట్‌తో ప్రజల జీవితాల్లో వెలుగునింపుతున్నామన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించేందుకు హుస్నాబాద్ నియోజకవర్గంలో 13 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేశామని అన్నారు. కోహెడ మండలం నాగ సముద్రాలలో 220 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణంతో మిగులు విద్యుత్‌ను స్టోరేజ్ చేసుకొని వాడుకునే వెసులుబాటు కూడా కల్పించుకున్నామని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ అన్నారు. కార్యక్రమంలో హన్మకొండ జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, సిద్దిపేట జెడ్పీ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, కొక్కుల కీర్తి, జెడ్పీటీసీ భూక్య మంగ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, విద్యుత్ అధికారులు తదితరులు ఉన్నారు.

ఫొటోలు లేవని ప్రజాప్రతినిధుల అలక..

నియోజకవర్గ విద్యుత్ విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా విద్యుత్ అధికారులు సభా వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో వివిధ మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీల ఫొటోలు లేవని ప్రజాప్రతినిధులు అలక వహించారు. ఫ్లెక్సీలో స్థానిక ఇద్దరి ప్రజాప్రతినిధుల ఫొటోలు పెట్టి మిగితా వారి ఫొటోలు పెట్టకపోవడంతో వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. సభా వేదికపైకి రావాలని విద్యుత్ అధికారులు ఆహ్వానించిన వేదిక కింది భాగంలో కూర్చున్నారు. వెంటనే స్థానిక ప్రజాప్రతినిధుల ఎవరి ఫొటోలు లేకుండా కేవలం మంత్రులు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఫొటోలతో ఉన్న మరో ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. ఫొటోల సెషన్ పేరుతో దాదాపు 20 నిమిషాల పాటు కార్యక్రమాన్ని నిలిపివేశారు. చివరకు ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ జోక్యం చేసుకొని ఎంపీపీలు, జెడ్పీటీసీలు వేదికపైకి రావాలని ఆహ్వానించిన కొద్దిసేపు తటపాయించారు. ఓ ఎంపీపీ లేచి మాట్లాడేందుకు మైక్ ఇవ్వాలని కోరినా మైక్ ఇవ్వలేదు. దీంతో ఎమ్మెల్యే ఒక్కసారిగా కార్యక్రమాన్ని నిలిపివేసి భోజనాలకు వెళ్దామా లేదంటే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించుకునేందుకు ప్రజాప్రతినిధులు వేదికపై వస్తారా లేదా అని సుతిమెత్తగా చురకలు వేశారు. దీంతో అలకవీడిన ప్రజాప్రతినిధులు లేచి వేదికపైకి వెళ్లడంతో ఫొటోల సెషన్ సమస్య సద్దుమణిగింది.

మెరుగైన విద్యుత్



గజ్వేల్‌రూరల్: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి తదితరులు

గజ్వేల్‌రూరల్: నేడు సీఎం కేసీఆర్ పాలనలో విద్యుత్ సమస్యలను అధిగమించి దేశానికే ఆదర్శంగా నిలిచినట్లు ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. పట్టణంలోని మహతీ ఆడిటోరియంలో సోమవారం జరిగిన విద్యుత్ విజయోత్సవ సభలో వారు మాట్లాడుతూ.. విద్యుత్ వినియోగదారుల ఇబ్బందులను తొలగించేందుకు సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేసి మెరుగైన విద్యుత్‌ను అందిస్తున్నారన్నారు. అంతకుముందు మహతీ ఆడిటోరియం వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. గడా ప్రత్యేకాధికారి ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణలో విద్యుత్‌శాఖ సాధించిన విజయాలపై విద్యుత్‌శాఖ డీఈఈ భానుప్రకాశ్ ప్రగతి నివేదికను సభికులకు వినిపించారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, తూప్రాన్ మున్సిపల్ చైర్మన్ రవీందర్, రైతుబంధు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దేవీ రవీందర్, ఆర్డీవో విజయేందర్‌రెడ్డి, ఏసీపీ రమేశ్, ఎంపీపీ దాసరి అమరావతి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్‌తో పాటు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లతో పాటు విద్యుత్‌శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

కొనుగోళ్ల ఆలస్యంపై రైతుల నిరసన

లింగుపల్లి రోడ్డుపై బైటాయించి ధర్నా



ఆందోళన చేస్తున్న రైతులు

మిరుదొడ్డి(దుబ్బాక): ధాన్యం కొనుగోళ్లు పూర్తిగా నెమ్మదించడంతో నానా అవస్థలకు గురవుతున్నామని మండల పరిధిలోని మల్లుపల్లి, లింగుపల్లి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ లింగుపల్లి రోడ్డుపై బైటాయించి ఆందోళనకు దిగారు. కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తీసుకొచ్చి 20 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. దీంతో ధాన్యం కుప్పలు కాంటాకు నోచుకోకపోవడంతో తిండి తిప్పలు మాని కొనుగోళు కేంద్రాల్లోనే పడిగాపులు కాయాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని అసహనం వ్యక్తం చేశారు. కాగా మల్లుపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నెలకొన్న సమస్యలపై మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి ఫోన్ ద్వారా రైతులు సమాచారం చేరవేశారు. కొనుగోలు కేంద్రంలో సమస్యలు లేకుండా చూస్తాననీ, కొనుగోళ్లు మరింత వేగవంతం చేసేలా అధికారులను ఆదేశిస్తానని ఎంపీ ఫోన్ ద్వారా రైతులకు హామీనిచ్చారు. దీంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు. సుమారు గంట పాటు సాగిన రైతుల ఆందోళనతో మిరుదొడ్డి గజ్వేల్ రోడ్డుకిరువైపులా ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

రైతులను మోసం చేయొద్దు

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో కొనుగోలు ప్రక్రియ వేగంగా జరపాలని భారతీయ కిసాన్ సంఘ్ మండల అధ్యక్షుడు బాపురెడ్డి అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండల ఎమ్మార్వో కార్యాలయం ఎదుట వరి ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలంటూ భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైతులను మోసం చేయకుండా పారదర్శకంగా చేపట్టాలన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



దుబ్బాక: విజేతలతో సీఐ కృష్ణ, ఎస్ఐ మహేందర్, సర్పంచ్ శ్రీనివాస్

దుబ్బాక: చెమటోడ్చి కష్టపడ్డ ప్రతీ వ్యక్తి జీవితంలో విజయం సాధించడమే కాక ఆరోగ్యంగా ఉంటారని సీఐ మున్నూరు కృష్ణ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా దుబ్బాక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం దుబ్బాక నుంచి చీకోడ్ గ్రామం వరకు రన్ ఫర్ హెల్త్ 5కే రన్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను చీకోడ్ సర్పంచ్ తాడ శ్రీనివాస్, జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీలలో సుమారు 200 మంది యువకులు పాల్గొన్నారు. దుబ్బాక నుంచి చీకోడ్ వరకు పోటీలు జరగగా దుబ్బాకకు చెందిన శ్రీనివాస్ మొదటి స్థానం, దుంపలపల్లికి చెందిన స్వామి 2వ, భాస్కర్ 3వ స్థానాల్లో నిలిచారు. అనంతరం విజేతలకు సీఐ కృష్ణ, ఎస్ఐ మహేందర్‌లు మెడల్స్ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు భూంరెడ్డి, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి, సభ్యులు పరంధాములు, రాజు, రమేశ్, పోలీస్ సిబ్బంది తదితరులున్నారు. దౌల్తాబాద్ మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 5కే రన్ కార్యక్రమం నిర్వహించారు.

కొమురవెల్లి(సిద్దిపేట): ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో యువత భాగస్వామి కావాలని చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం మండల కేంద్రంలో ఎస్ఐ చంద్రమోహన్ యాదవ్‌తో కలసి రన్ ఫర్ హెల్త్ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పోలీస్ బొమ్మ నుంచి కిష్టపేట గ్రామం వరకు 5కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని యువత పాల్గొని విజయవంతం చేశారు.

తొగుట(దుబ్బాక): సమాజాభివృద్ధికి యువత పాటు పడాల్సిన అవసరం ఎంతైనా ఉందని తొగుట ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి అన్నారు. తొగుటలో 5కే రన్ పోటీలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో చందాపూర్ సర్పంచ్ నర్సింహులుయాదవ్, ఎల్లారెడ్డి ఉపసర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



గజ్వేల్ కోర్టు ఆవరణలో మొక్క నాటుతున్న న్యాయవాదులు



సిద్దిపేటఎడ్యుకేషన్: ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గజ్వేల్‌రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి సౌమ్య, అడిషనల్ సివిల్ జడ్జి ప్రియాంకలు పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సోమవారం గజ్వేల్ పట్టణంలోని కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. ప్రజలు ప్లాస్టిక్‌కు బదులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అంతకుముందు కోర్టు ఆవరణలో మొక్క నాటారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిన నర్సింలు, మండల్ లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహచారి, యామిని, న్యాయవాదులు, కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేటఎడ్యుకేషన్: పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు ప్రతి పౌరుడూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ, అటానమస్, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు డాక్టర్ సీహెచ్ ప్రసాద్, డాక్టర్ జీవన్ కుమార్‌లు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ గోపాలసుదర్శనం, డాక్టర్ శ్రద్ధానందం, డాక్టర్ రాణి, డా.జగదీశ్వరాచారి, డా.సువర్ణాదేవి, స్వప్న, జ్యోతి, సంతోష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని కోర్టు ఆవరణలో ప్రిన్సిపల్ సివిల్ కోర్టు జడ్జి శివరంజని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జడ్జి శివరంజని మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, అడిషనల్ పీపీ రవికుమార్, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, న్యాయవాదులు పాల్గొన్నారు. హుస్నాబాద్ ఆర్టీసీ సిబ్బంది ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో చెత్తను తొలగించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రయాణికులు చెత్త చెదారం బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వేయకుండా కుండీల్లో వేయాలన్నారు. కార్యక్రమంలో బస్టాండ్ ఎస్ఎం రాములు, ఏడీసీ యాదగిరి, కార్గో ఇన్‌చార్జి సురేశ్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అందరూ మొక్కలు నాటాలి



కరపత్రం ఆవిష్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. ×ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పర్యావరణ కరపత్రాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వేలేటి రాధాకృష్ణ శర్మతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరం విరివిగా మొక్కలు నాటి పర్యావరణ సమతుల్యతకు తోడ్పడుదామన్నారు. పర్యావరణ కరపత్రాల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న క్రియేటివ్ టీచర్స్ అసోసియేషన్ సేవలను అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లింగ శ్రీనివాస్, రమేశ్, కార్యవర్గ సభ్యులు రేకులపల్లి లింగారెడ్డి, నందిని భగవాన్‌రెడ్డి, శ్రీకాంత్, కోడిత్యాల శివకుమార్ పాల్గొన్నారు.

హామీలకే పరిమితమైన బీఆర్ఎస్

పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి

గజ్వేల్‌రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, మాయ మాటలతో ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగిస్తోందని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి ఆరోపించారు. పట్టణంలోని 8వ వార్డులో సోమవారం కాంగ్రెస్ నేతలతో కలిసి పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వార్డులో చేపట్టిన అసంపూర్తి పనులతో చెత్తబండ్లు సైతం తిరగలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దీవెనలు ప్రజలపై ఉండాలి



బందారంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాల్లో పాల్గొన్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: అమ్మవారి దీవెనలు ఎల్లప్పుడూ ప్రజలపై ఉండాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిలు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని తూప్రాన్ రోడ్డుమార్గంలో గల ఊడలమర్రి చెట్టుకింద వెలసిన బంగారు మైసమ్మతల్లి విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

కొండపాక(గజ్వేల్): గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠలు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు దోహదం చేస్తాయని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆకాంక్షించారు. మండల పరిధిలోని బందారంలో జరుగుతున్న గ్రామ దేవతల ప్రతిష్ఠోత్సవాల్లో సోమవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు చింతల సాయిబాబ, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆర్థికసాయం**

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని ఖమ్మంపల్లిలో పేద కుటుంబ యజమాని మణెమ్మ అంత్యక్రియలకు సోమవారం జెడ్పీటీసీ అనంతుల అశ్విణీ, ప్రశాంత్ దంపతుల సహకారంతో స్థానిక ఎంపీటీసీ యాదగిరి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. మణెమ్మ సోమవారం మృతి చెందగా, తండ్రి లక్ష్మారెడ్డి కొన్నేళ్ల కిందట మృతి చెందాడు. దీంతో కూతురు అంజలి అనాథగా మిగిలింది. అంజలి పైచదువుల కోసం తమవంతుగా సహాయ సహకారాలు అందిస్తామంటూ జెడ్పీటీసీ దంపతులు భరోసానిచ్చారని ఎంపీటీసీ యాదగిరి తెలిపారు.

◆ **ఇర్కోడ్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా బుచ్చిబాబు**

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని ఇర్కోడ్ మోడల్ స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా ఎస్.బుచ్చిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న ఆర్.నాగరాజు వ్యక్తిగత కారణాలతో ప్రిన్సిపాల్ పదవి బాధ్యతలు తొలగించాలని కొద్దిరోజుల క్రితం ఉన్నతాధికారులకు అర్జీ పెట్టుకున్నారు. దీంతో విద్యాశాఖ అధికారులు ప్రిన్సిపాల్ బాధ్యతలను బుచ్చిబాబుకు అప్పగించారు.

◆ **కరపత్రం ఆవిష్కరణ**

సిద్దిపేటకమాన్: ఇంటింటికీ ధర్మ సమాజ్ పార్టీ కరపత్రికను పార్టీ నాయకులు సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవిబాబు, నాయకులు రాజు, సురేశ్, కిషన్ పాల్గొన్నారు.

◆ **మేలు రకం జాతీ సంతతితో ఉపయోగాలెన్నో**

దుబ్బాక: మేలు రకం జాతీ పశువుల సంతతితో ఎన్నో ఉపయోగాలున్నాయని రాయపోల్ మండలం వడ్డేపల్లి సర్పంచ్ చంద్రశేఖర్, ఉపసర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ ప్రభాకర్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాయపోల్ మండలం వడ్డేపల్లిలో మేలు రకం జాతీ దూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల మిత్ర సూపర్‌వైజర్ భాస్కర్ మాట్లాడుతూ.. 55 రకాల దూడలను ప్రదర్శించి వాటికి నట్టల మందులు, చెవి పోగులను వేశారన్నారు. గోపాల మిత్ర ద్వారా పశువులకు కృత్రిమ గర్భధారణ చేయడం ద్వారా మేలు జాతీ దూడలను అభివృద్ధి చేయొచ్చన్నారు. దీని ద్వారా పాల ఉత్పత్తి అధికంగా ఉంటుందని సూచించారు.

◆ **విద్యార్థులలో కళా నైపుణ్యాలను వెలికితీయాలి**

దుబ్బాక: ప్రతీ విద్యార్థిలో ఏదో ఒక కళ సహజంగానే ఉంటుందని ఆ కళను వెలికితీసి దానిని మెరుగుపరిచేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ సిద్దిపేట ప్రాంతీయ కార్యాలయ ప్రముఖులు వికాస్ ఏడ అన్నారు. సోమవారం దౌల్తాబాద్ మండల పరిధిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్దిపేట ప్రాంతీయ కార్యాలయం దొమ్మాట శాఖ ఆధ్వర్యంలో ముస్కాన్ ఖాతాదారులైనా బాలబాలికలకు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు.

◆ **రైలు ప్రమాద బాధితులకు నివాళి**

సిద్దిపేటకమాన్: రైలు ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి సిద్దిపేట సావర్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. సావర్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో సిద్దిపేట వీర సావర్కర్ చౌరస్తా నుంచి సిద్దిపేట బస్టాండ్ చౌరస్తా వరకు సోమవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రాజ్‌రతన్, సభ్యులు విజయ్, వెంకట్, సుమన్, ఆనంద్, ఉదయ్ పాల్గొన్నారు.

◆ **లక్షపుష్పార్చన**

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యాసరస్వతీ క్షేత్రంలో సోమవారం మూల మహోత్సవ వైభవంతో అలరారింది. భక్తులు అమ్మవారికి లక్షపుష్పార్చన నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి పర్యవేక్షణలో శ్రీవిద్యాధరి మాత మూల విగ్రహానికి విశేష పంచామృతాభిషేకం జరిపి, అలంకార సేవ చేశారు. అనంతరం భక్తులు సామూహిక లక్షపుష్పార్చన, లలితాపారాయణం, సప్తశతీ, చండీ పారాయణం, చండీహోమాది కార్యక్రమాలు నిర్వహించారు. చతుష్ష్యోపచార పూజలు, కుంకుమార్చన జరిపారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మహిళలకు పండ్లు అందిస్తున్న మహిళా మోర్చా నాయకురాలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అరుణారెడ్డి అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని ఆదర్శనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను తెలియజేశారు. మహిళలకు పసుపు, బొట్టు, చీర, పండ్లు గాజులు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శారద, మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్ బండి సుగుణ, జిల్లా కార్యవర్గ సభ్యురాలు కనకమ్మ, మహిళలు పాల్గొన్నారు.

హుస్నాబాద్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పోషణ్ అభియాన్ పథకం ద్వారా దేశంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రత్యేక నిధులు కేటాయించిందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు లక్కిరెడ్డి తిరుమల అన్నారు. పట్టణంలోని రెడ్డి కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలకు, తల్లులకు పోషకాహారాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా తిరుమల మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పిల్లలకు పోషకాహార లోపం రాకుండా అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదరి తోట స్వరూప, పట్టణ అధ్యక్షురాలు దీపిక, శారద, ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య



అహ్మదీపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



ముస్త్యాలలో ఎన్‌రోల్‌మెంట్ చేస్తున్న ఉపాధ్యాయులతో ఎంఈఓ నర్సింహ్మారెడ్డి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిఏటా చేపడుతున్న ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో గ్రామంలో ఉపాధ్యాయులతో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చాడ నవీనశ్రీనివాస్‌రెడ్డి, హెచ్ఎం కరీమొద్దీన్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యాయులు హఫీజ్, రామకృష్ణ, బాలుచరణ్ పాల్గొన్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ చిన్నకోడూరు, చంద్లాపూర్, రామునిపట్ల, పెద్దకోడూరు గ్రామాల్లో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

చేర్యాల(సిద్దిపేట): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని మండల విద్యాధికారి మొగుళ్ల నర్సింహ్మారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముస్త్యాల జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లారెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ విజయ్‌కుమార్, హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లయ్య, ఉపాధ్యాయులు రాజిరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజయ్య, శ్రీనివాస్, మోహినీ బాయి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): దూళ్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఇమ్మడి సంజీవరెడ్డి, ఎంపీటీసీ నర్సింలు, హెచ్ఎం మీనాంజనేయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అందె, లింగుపల్లి, లక్ష్మీనగర్, ఆరెపల్లి, మిరుదొడ్డితో పాటు పలు గ్రామాల్లో ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతూ ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యలు పెంచేలా ప్రత్యేక చర్యలు చేపట్టిందని హైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య పేర్కొన్నారు. కుకునూరుపల్లిలోని హైస్కూల్లో నిర్వహణ యాజమాన్య కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, విద్యాబోధనల విషయమై ఎస్ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య చేతుల మీదుగా సోమవారం కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలకృష్ణ, ఉపాధ్యాయులు, యాజమాన్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగం నుంచి తొలగింపు

కొండపాక(గజ్వేల్): కాల్వల తవ్వకం పనుల నిర్వహణ కంపెనీలో సూపర్‌వైజర్ ఉద్యోగం చేస్తున్న మాచర్ల సంపత్‌కుమార్‌ను తొలగిస్తున్నట్లు కంపెనీ యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కొంది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మల్లన్నసాగర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి నీరు వెళ్లేందుకు కాల్వల తవ్వకం నిర్వహణను సాయిదత్త కంపెనీ టెండర్ ద్వారా దక్కించుకుంది. దీంతో కంపెనీ సూపర్‌వైజర్‌గా మాచర్ల సంపత్‌కుమార్‌ను నియామకం చేసుకుంది. బాధితులకు అందించే నష్టపరిహారం విషయమై ఎంపీపీ ఉపాధ్యక్షుడు దేవి రవీందర్ లంచం డబ్బులు డిమాండ్ చేస్తున్నారంటూ సూపర్‌వైజర్ మాచర్ల సంపత్‌కుమార్ ప్రచారం చేశారంటూ దేవి రవీందర్ మే 31న కుకునూరుపల్లి పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు అయిన విషయం పాఠకులకు తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పందించిన సాయిదత్త కంపెనీ యాజమాన్యం చేసిన విచారణలో మాచర్ల సంపత్ కుమార్ అనవసరంగా ఇతరులపై లేనిపోని అభియోగాలు చేస్తున్నారని గుర్తించారు. ఈ మేరకు సంపత్‌కుమార్‌ను ఉద్యోగంలో నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటనలో తెలిపారు. భూగర్భజలాల పెంపు కోసం నిర్మిస్తున్న కాల్వ తవ్వకం పనులు సజావుగా సాగేందుకు రైతులు సహకరించాలని సాయిదత్త కంపెనీ యాజమాన్యం విజ్ఞప్తి చేసింది.